నిరుపయోగంగా రైతుబజార్

- ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- నెరవేరని ఎన్ఆర్ఐ ఆశయం
- అసహనం వ్యక్తం చేస్తున్న స్థానికులు



బురదమయంగా మారిన రైతుబజార్ ప్రాంగణం



మండల కేంద్రంలోని రైతు బజార్

ఆత్మకూరు : గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా మండల కేంద్రంలో ఒకే చోట కూరగాయల అమ్మకాలు, కొనుగోళ్లు జరగాలని ఎన్ఆర్ఐ గొంది నర్సింహారెడ్డి స్వంత నిధులతో ఏర్పాటు చేసిన రైతుబజార్ నిరుపయోగంగా మారింది. తాను చదువుకున్న గ్రామంలో తోటి మిత్రుడు డాక్టర్ బూర గోపాలకృష్ణ జ్ఞాపకార్థం ఎన్ఆర్ఐ నర్సింహారెడ్డి రూ.21లక్షల సొంత నిధులతో తన తల్లిదండ్రులు గొంది మల్లారెడ్డి-నర్సమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతు బజార్ నిర్మించారు. ఈ బజార్‌ను గతేడాది జనవరి 30న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మిగతా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. అయితే కొద్ది రోజుల్లోనే రైతుబజార్ నిరుపయోగంగా మారింది. వ్యాపారులతో మాట్లాడి కొనసాగే విధంగా చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లక్షలాది నిధులతో ఎన్ఆర్ఐ రైతుబజార్ నిర్మిస్తే ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రైతుబజార్ కొనసాగేందుకు కావాల్సిన సలహాలు, సూచనలు చేయలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతు బజార్ ప్రాంగణంలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, అపరిశుభ్రంగా మారిందని ఆరోపిస్తున్నారు. రైతుబజార్ ఆవరణ బురదమయంగా మారిందని, గ్రామస్థాయిలో సమన్వయ కమిటీ వేసి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. భవనం, షెడ్డు శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు రైతుబజార్‌ను పరిశీలించి కావాల్సిన సదుపాయాలు, వ్యాపారుల అభిప్రాయాలు సేకరించి రైతు బజార్ కొనసాగే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన



సీహెచ్‌సీ వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

కమలాపూర్ : మండల కేంద్రంతో పాటు ఉప్పల్ గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సోమవారం పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, వారాంతపు సంతలు, బస్టాండ్లు, సామాజిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పరిశీలించి తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల్లోని 16 ఇళ్లలో పరిశుభ్రత, నీటి నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యాధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ బృందంతో ఎంపీడీఓ గుండె బాబు సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలోని ప్రభుత్వ సంస్థలన్నింటిలో తప్పనిసరిగా నీటి నిర్వహణ, ఇంకుడు గుంతలు, తడి, పొడి చెత్త వేరు చేసే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ తెలంగాణ స్టేట్ కో ఆర్డినేటర్ సురేష్, తెలంగాణ స్టేట్ సూపర్‌వైజర్ మధుకర్, రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్స్ రాజు, రేవంత్, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దామెర : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సూచించారు. మండలంలోని ఊరుగొండలో సోమవారం టీఎస్ఎస్ కళాకారులు కళాజాత నిర్వహించి పలు అంశాలపై పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, చికన్‌గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ మైదం జోత్స్నదేవి, గాయకులు ఇనుగుర్తి మధు, దార దేవేందర్, వాజిద్, సారంగపాణి, వెన్నెల శ్రీనాథ్, రజియ, చైతన్య, సంధ్య, జానకి, వేదవతి పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

వేలేరు : ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ముద్దసాని వరణ్ కోరారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఎర్రబెల్లి నుంచి హుజూరాబాద్ వరకు బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. బస్సు సర్వీసు వలన పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్, శ్రవణ్, దిలీప్ పాల్గొన్నారు.

ఒక్కో ట్రిప్పునకు రూ. 200 ఇవ్వాలి

- 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు, జేసీబీ డ్రైవర్‌కు పలువురి బెదిరింపు
- డబ్బులు ఇవ్వకపోవడంతో దాడి
- చర్య తీసుకోవాలని బాధితుల ధర్నా



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బాధితులు

శాయంపేట : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మట్టి, మొరం తరలిస్తున్న జేసీబీ డ్రైవర్, ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమకు డబ్బులు ఇవ్వాలని గ్రామానికి చెందిన పలువురు బెదిరింపులకు దిగారు. డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకోని జేసీబీ డ్రైవర్‌తో పాటు అతడి బావమరిది, ఏడు నెలల గర్భిణీపై దాడికి దిగారు. ఈ సంఘటన మండలంలోని మాందారిపేటలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన తక్కళ్ల భాస్కర్ జేసీబీ నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. అయితే తన అన్నయ్య సాంబయ్యకు చెందిన ట్రాక్టర్లతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొరం రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొమ్ముల విష్ణు, మల్లికార్జున్, సుమంత్ అతడి దగ్గరకు వచ్చి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.200 తమకు ఇవ్వాలని బెదిరించినట్లు తెలిపారు. దీంతో భాస్కర్ నిరాకరించడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఆదివారం విష్ణు, మల్లికార్జున్, సుమంత్, దిలీప్, సందీప్, నిఖిల్‌కు లబ్ధిదారులు, జేసీబీ డ్రైవర్ భాస్కర్ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆదివారం రాత్రి దుర్భషలాడుతూ భాస్కర్, బావమరిది దాసరి నరేష్, 7 నెలల గర్భిణీ అయిన నరేష్ భార్య మౌనికపై దాడి చేసినట్లు చెప్పారు. బాధితుడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమ్ముల విష్ణు, మల్లికార్జున్, సందీప్, సుమంత్, దిలీప్, నిఖిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాధితుల ధర్నా

తమపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని బాధితులు, ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం జాతీయ రహదారి (353)పై ధర్నాకు దిగారు. ఎస్సై హామీ మేరకు ధర్నా విరమించారు.

పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ



ధర్మసాగర్ : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



వేలేరులో..



ఎల్కతుర్తి : ముల్కనూరులో..



ఐనవోలులో..

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం సమీపంలో మండల అధ్యక్షుడు సోంపెల్లి అన్వేష్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్ గంగారపు శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరగకముందు మాదిగలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా 1994 జులై 7న ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని స్థాపించినట్లు తెలిపారు. 2000 సంవత్సరంలో వర్గీకరణను సాధించుకోవడంతోపాటు 2004 సంవత్సరం వరకు 6000 వేల ఉద్యోగాలు వచ్చినట్లు చెప్పారు. మాదిగలకు ఉద్యోగాలు రావడం జీర్ణించుకోలేని కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించి నిలిపి వేసినట్లు ఆరోపించారు. మళ్ళీ మంద కృష్ణమాదిగ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి 2025లో ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నట్లు చెప్పారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభం నుంచి వర్గీకరణ అమలైనప్పటి వరకు సహకరించిన అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను, పత్రికా విలేకరులను శాలువాలతో సన్మానించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, అనిల్, రాజు, వివిధ పార్టీల నాయకులు శోభ, కుమార్, లెనిన్, ప్రసాద్, ఆరోగ్యం, సుదర్శన్‌రెడ్డి, రాజు, రవి, విలేకరులు కరియప్ప, లెనిన్, గోపాల్, సుమన్, కమలాకర్, రమేశ్, శ్రీధర్, రాజేశ్వర్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి సంబురాలు జరుపుకొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని కొండపర్తి, నర్సింహుల గూడెం, సింగారం, వెంకటాపురం, గర్మిళ్లపల్లి, నందనం, వనమాల కనపర్తి తదితర గ్రామాల్లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. అదే విధంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 60వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేశారు. పలుచోట్ల అన్నదానం చేపట్టారు. ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఐనవోలు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ నారాయణ, జిల్లా నాయకులు రమేశ్ పాల్గొన్నారు.

దామెర : మంద కృష్ణమాదిగ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ జన్మదినాన్ని సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించిన అనంతరం మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

నడికూడ : మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ సంఘం నాయకులు జెండా ఆవిష్కరించి సంబురాలు జరుపుకొన్నారు.

వేలేరు : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. మండల ఇన్‌చార్జ్ శాంతిసాగర్, మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, నాయకులు సలీం మాలిక్, రాజయ్య, ధర్మేందర్, యేసు, శంకర్, కరుణాకర్, సాంబరాజు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆ సంఘం మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

అందుబాటులో సబ్సిడీ వరి విత్తనాలు

దామెర : సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అల్లె రాకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ భద్రతా మిషన్(ఎన్ఎఫ్ఎస్ఎం) ద్వారా ఖరీఫ్ 2025-26 సంవత్సరానికి సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఎన్ఆర్ 15048 రకం విత్తనాలు 15 క్వింటాళ్లు, (25 కిలోల) బస్తాకు రూ.500 సబ్సిడీ పోను రూ.665 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కేఎన్ఎం 1638 రకం విత్తనాలు 15 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీ మినహా రూ. 575 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన వారు ఈఏఓలను సంప్రదించాలని కోరారు.

భూ భారతి దరఖాస్తులపై సర్వే

శాయంపేట : ఇటీవల చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి రైతులు అందించిన దరఖాస్తులపై సోమవారం కాట్రపల్లి ఏఆర్ఐ రమేష్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను కేటగిరిలుగా విభజించి పట్టాపాస్‌పుస్తకంలోని మొదటి పేజీలోని పేరు గాని, తండ్రి పేరు గాని తప్పుబడిన వాటిని గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన దేవనాడి రవి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. రవి మృతదేహానికి పూలమాల వేసి అంతమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం గంగిరేణి గూడెం గ్రామానికి చెందిన పోతు రాములు, శాయంపేట గ్రామానికి చెందిన మామిడి త్రిశూల్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా పరామర్శించారు. గోవిందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిష్టయ్య ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొంది కోలుకోగా మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

ధర్మారెడ్డి పరామర్శ

పరకాల : అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పరకాల పీఏసీఎస్ చైర్మన్ గుండెబోయిన నాగయ్యతో పాటు మాతృమూర్తిని కోల్పోయిన పీఏసీఎస్ డైరెక్టర్ చెరిపల్లి శంకర్ సోదరులను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగరాజు, నవీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దామెర : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన గజ్జి కలమ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సూర్య ట్రస్ట్ చైర్మన్ గజ్జి విష్ణు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట సూర్య ఆస్పత్రి ఎండీ సురేష్, స్థానిక యువకులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం



ఐనవోలు : యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని పంథిని గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మోడం వరుణ్ (వినయ్) తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో తల్లిదండ్రులు కుమారుడి ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. దీంతో యువకుడి తల్లి మేడం రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మెరూన్ కలర్ టీషర్ట్, బ్లాక్ అండ్ బ్లూ కలర్ పాయింట్ ధరించాడని, ఎత్తు 5 ఫీట్ల 3 అంగుళాలు ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు 8712685244, 8712685030 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

ఏపీఓ శ్రీనివాస్‌కు ఘన నివాళి



కమలాపూర్ : గుండెపోటుతో మృతిచెందిన జనగామ జిల్లా దేవరుప్పుల మండల ఏపీఓ శ్రీనివాస్‌కు ఎంపీడీఓ, ఉపాధి హామీ సిబ్బంది సోమవారం నివాళులర్పించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. ఎంపీడీఓ బాబు, సూపరింటెండెంట్ కరణ్, ఏపీఓ రమేశ్, ఈసీ కార్తీక్, టీఏలు, ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నడికూడ : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి కోరారు. సోమవారం మండలంలోని కౌకొండ, చర్లపల్లి, నార్లపూర్, నడికూడ, వరికోల్, చౌటుపర్తి ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించాలని, ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో తీసుకొచ్చిన జీఓ 25ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావుల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిశాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు విక్రమ్, శివకుమార్, శ్రీనివాస్, సత్యపాల్, సుభాని, శంకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న క్రాంతికుమార్

శాయంపేట : మండల కేంద్రంలో ఇసుక డంపు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేయాలని బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మారేపల్లి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆ సంఘ సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా లభించడం లేదని, లబ్ధిదారులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అధిక ధరలు చెల్లించి ఇసుక కొనుగోలు చేస్తున్నారని, దీంతో వారిపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం కారణంగా వాగులో అధిక నీరు చేరడం వలన ఇసుక రవాణా తగ్గుతుందని, ఇళ్ల నిర్మాణం నిలిపోయే అవకాశం ఉందని అన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి శాయంపేటలో ఇసుక డంపు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు సుమన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

ఏఓ రాకేష్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రాకేష్

దామెర : నానో యూరియాతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి రాకేష్ అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో నానో యూరియా వినియోగంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంటలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. నానో యురియా నత్రజనిని అందిస్తుందన్నారు. ఇది మొక్కల ఎదుగుదలను మెరుగుపరిచి దిగుబడిని పెంచి పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుందన్నారు. అవసరం మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు యాదగిరిగౌడ్



మాట్లాడుతున్న యాదగిరిగౌడ్

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించి పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు బోనగాని యాదగిరిగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో గౌడ సంఘం సమావేశం తండ వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు(కిట్లు) ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో గీత కార్మికులు తాటి చెట్లపై నుంచి పడి మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా ప్రమాదవశాత్తు తాటిచెట్లపై నుంచి పడి మృతిచెందిన కల్లుగీత కార్మికుల కుటుంబాలకు బీసీ కార్పొరేషన్ అందించే లక్ష రూపాయాలు ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు, చనిపోయిన గీత కార్మికులకు రూ.25వేలు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, రమేశ్, విజయ్, రఘు, శివకుమార్, సత్యనారాయణ, కుమారస్వామి, వీరాస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి'



మాట్లాడుతున్న మోహన్

ఐనవోలు : మండలంలోని పంథిని, పున్నేలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల సన్నాహక సమావేశాలు సోమవారం జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తంపుల మోహన్, మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలిచ్చి నిలబెట్టుకోలేని అంశాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిందని, ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఉస్మాన్ అలీ, సురేష్, సదానందం, గ్రామ ఇన్‌చార్జ్‌లు జయశంకర్, రాఘవులు, కుమార్, రఘువంశీ, చేరాలు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పొలంబాట



పొలంబాట కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డీఈ

డీఈ సామ్యనాయక్

కమలాపూర్ : విద్యుత్ సమస్యల పరిష్కారానికే పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ సామ్య నాయక్ తెలిపారు. విద్యుత్ శాఖ కమలాపూర్ సెక్షన్ ఆధ్వర్యంలో సోమవారం కమలాపూర్‌లో పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పొలంబాట కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏడీ వంశీకృష్ణ, ఏఈ రాములు, ఎస్ఎల్ఐ మోహన్, ఎల్ఐ సామ్యూల్, లైన్‌మెన్ మహేందర్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామంలో ఫార్మర్ (కిసాన్) రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు వెంటనే చేసుకోవాలని ఏఈఓ నవ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్‌తో పాటు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని పేర్కొన్నారు.